# స్మృతి

— వై.సి.పి. వెంకటరెడ్డి



పురాణ పఠనం జరుగుతోంది. పఠిత రాగయుక్తంగా చదువుతున్నాడు. పౌరాణికుడు అరటిపండొలిచి చేతిలో పెట్టినట్లు భావం చెబుతున్నాడు. శ్రోతలంతా మంత్రముగ్ధుల్లా వింటున్నారు.

హరిశ్చంద్రోపాఖ్యానంలో స్మశాన ఘట్టం సాగుతోంది. శివరంజని, అసావేరి, తోడి లాంటి దుఃఖం కలిగించే రాగాలు ఉపయోగించి చదువుతున్నాడు పఠిత.

విగతజీవుడయిన లోహితుని శవం ముందుంచుకొని హృదయవిదారకంగా శోకిస్తోంది చంద్రమతి. శ్రోతల్లో యాభై శాతం మంది కళ్లల్లో నీళ్లునిండాయి. అక్కడున్న ఆడవాళ్లంతా సాక్షాత్ చంద్రమతులయ్యారంటే అతిశయోక్తికాదు. అయితే వాళ్లంతా మౌనంగా రోదిస్తున్నారు. కారిపోతున్న కన్నీరు అప్పుడప్పుడూ పైటకొంగుతో ఒత్తుకుంటున్నారు. అయితే ఓ స్త్రీ మాత్రం వెక్కివెక్కి ఏడుస్తోంది. అది కథ మాత్రమేనన్న వాస్తవాన్ని విస్మరించి శ్రోతలు శోకిస్తున్నారంటే చదువుతున్న ధోరణే, భావం చెబుతున్న తీరూ బావుందన్న భావం కలగడం వల్ల పౌరాణికుడు ఆనందంతో ఉప్పొంగిపోయి అభినయించసాగాడు. అంతలోనే స్మశాన వైరాగ్యం, ప్రసవ వైరాగ్యం, పురాణ వైరాగ్యం తాత్కాలికమయినవన్న విషయం అతనికి జ్ఞాపకం వచ్చింది.

"మీరు ఎంతో శ్రద్ధగా వింటూ కథలో లీనం కావడం ప్రశంసించ తగ్గ విషయం. కథలో వచ్చిన పాత్రల భావాలతో శ్రోతలు తాదాత్మ్యం చెందడం సామాన్య విషయం కాదు. అయితే శ్మశాన వైరాగ్యం, ప్రసవ వైరాగ్యం, పురాణ వైరాగ్యం తాత్కాలికమయినవే గాని, శాశ్వతంగా ఉండవని పెద్దలు చెబుతారు." అన్నాడు పౌరాణికుడు.

"ఆ వైరాగ్యాల గురించి చెప్పండి స్వామీ!" అన్నాడు ఎదురుగా కూచొని ఊకొడుతున్న వృద్ధుడు.

పౌరాణికుడు ఆ మూడు వైరాగ్యాలను గురించీ గొప్పగా వివరించారు.

సభలో ఓ మూల కూచుని, ఏడుస్తున్న ఆమెపై అందరి దృష్టి పడింది.

వాళ్లందరూ తన మీద సానుభూతి చూపుతున్నారని, తను ఏడుస్తున్నందువల్లే వాళ్లంతా కళ్లనీళ్లు పెట్టారన్న భావం కలగడం వల్ల ఆమె ఇంకా గొల్లుమంది.

అందరూ ఆమెను ఓదార్చసాగారు.

"ఈ సంఘటన ఎప్పుడో జరిగింది. లోహితుడు ఇప్పుడే చనిపోయినట్లు ఏడుస్తావెందుకమ్మో" అన్నాడు పౌరాణికుడు.

"వాడెవుడు సామీ?" అంది ఆమె వెక్కుతూనే.

ఆమె ప్రశ్న విన్న పౌరాణికుడు విస్తుపోయి, "మరి ఎందుకేడుస్తున్నావమ్మా?" అన్నాడు.

"చచ్చిపోయిన నా మొగుడు గ్యాపకం వత్తే ఏడిసినా సామీ!" అంది అమాయకంగా.

పాపం, ఆమె భర్త పాముకరచి చనిపోయాడేమోనని, అందుకే పాముకాటుకు గురై చనిపోయిన లోహితుని కథ విని భర్తజ్ఞాపకం వచ్చాడని భావించి, "నీ భర్త పురుగు ముట్టి చనిపోయాడా తల్లీ?" అంటూ ప్రశ్నించాడు పౌరాణికుడు.

"లేదు సామీ, చలిజరంతో చచ్చిపోయిండు," అంది.

"అయ్యో, మలేరియా జ్వరమా? మందులివ్వలేదా?" అన్నాడు పౌరాణికుడు.

"మందులతో బాగ్గాదు సామీ ఆ జరం? మూడు దోవలు కలిసే చోట ముద్దబెట్టి దాటించినాము. నంబ్రరాయికి పసుపు కుంకుమ పెట్టి పూదించి (పూజించి) నాము. వరసాకు కట్టించినాము. ఇయన్నీ చేయకుండా పోలేరమ్మకు మొక్కుకోడంటే బాగయ్యేది సామీ! అమ్మోరికి కోపమొచ్చి నా మొగున్ని తీసకపోయింది సామీ!" అంటూ ముక్కు చీది, కళ్లు తుడుచుకుంది.

అయ్యో పాపం, అమాయకురాలు! అనుకుంటూ, "ఆయన ఇప్పుడు ఎలా జ్ఞాపకం వచ్చాడమ్మా?" అన్నాడు పౌరాణికుడు.

"అదో ఆ పుత్తకానికి ఉందే, ఆ దారం చూసి నా మొగుడు గ్యాపకం వచ్చిండు సామీ!" అంది.

ఆ దారానికీ, ఆమె భర్తకూ సంబంధమేమిటో ఎవరికీ అర్థం కాలేదు.

"ఈ దారానికీ నీ భర్తకూ సంబంధమేంటమ్మా? ఈ దారం చూసి నీ మొగుడు ఎలా జ్ఞాపకం వచ్చాడు?" అన్నాడు పౌరాణికుడు.

"నా మొగుని మొలతాడు అట్టాగే ఉండేది సామీ?" అంటూ మళ్లీ గొల్లుమంది పురాణం వినడానికి వచ్చిన ఆ అమాయకురాలు.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్